
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
గురువారం 6 నవంబరు 2025

వైభవంగా కార్తీక పౌర్ణమి

గోదావరిలో భక్తుల పుణ్యస్నానాలు

కిక్కిరిసిన శైవ క్షేత్రాలు

సామూహిక సత్యనారాయణ వ్రతాలు

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని బుధవారం జిల్లా వ్యాప్తంగా ఆలయాలు కిటకిటలాడాయి. ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నృసింహస్వామి ఆలయం, వెల్గటూర్ మండలం కోటిలింగాలలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. గోదావరిలో పుణ్య స్నానాలు ఆచరించి కార్తీక దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. లోపలి పేజీల్లో..


ధర్మపురి పుష్కరిణిలో దీపాలంకరణ


ఆసక్తి ఉన్నా.. ఆడించే వారేరి?

భర్తీకి నోచుకోని ఫిజికల్ డైరెక్టర్లు

జిల్లాలో 16 ప్రభుత్వ కళాశాలల్లో పోస్టులు ఖాళీ

క్రీడలకు దూరమవుతున్న ఇంటర్ విద్యార్థులు

జగిత్యాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆటలపై ఆసక్తి ఉన్నా.. ఆడించే వారు లేక విద్యార్థులు క్రీడలకు దూరం అవుతున్నారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరమని, వారు శారీరకంగా, మానసికంగా ఎదగడానికి ఆటలు ఉపయోగపడతాయని అధికారులు, ప్రజాప్రతినిధులు వివిధ సందర్భాల్లో చెబుతుంటారు. కానీ ప్రస్తుతం ఫిజకల్ డైరెక్టర్ల పోస్టులన్నీ ఖాళీగా ఉండడంతో ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులకు క్రీడా సాధనకు ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లా వ్యాప్తంగా ఏ ఒక్క ప్రభుత్వ జూనియర్ కళాశాలలోనూ ఫిజికల్ డైరెక్టర్ పోస్టు భర్తీకి నోచుకోకపోవడం పట్ల విద్యార్థులు, క్రీడాకారులు నిరుత్సాహం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో పరిస్థితి ఇలా..

జిల్లా వ్యాప్తంగా 16 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా 10 వేల మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. ఇందులో 10 ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు మంజూరు అయినప్పటికీ భర్తీకి నోచుకోలేదు. దీంతో కొన్ని సంవత్సరాలుగా పోస్టులు ఖాళీగా ఉంటున్నాయి. జిల్లాలో ధర్మపురి, కోరుట్ల బాలికల కళాశాల, జగిత్యాల బాలుర కళాశాల, కొడిమ్యాల, మెట్‌పల్లి, మేడిపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు మంజూరు కావాల్సి ఉంది. కాగా జిల్లాలోని పలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు క్రీడా మైదానం లేదు. కొన్ని కళాశాలల్లో క్రీడా మైదానం ఉన్నా నిర్వహణ లేకపోవడంతో పిచ్చి మొక్కలు పెరిగాయి. క్రీడలు నిర్వహించకపోవడంతో మైదానాలు నిరుపయోగంగా ఉంటున్నాయి. మెట్‌పల్లి, కోరుట్ల బాలుర, బాలికల కళాశాలలు, మల్లాపూర్ తదితర కళాశాలల్లో మైదానాలు లేవు. కథలాపూర్ కళాశాల మైదానం కుంటలో ఉండడం, బీర్‌పూర్ మైదానం లెవల్ లేకపోవడం, కొడిమ్యాల మైదానంలో పిచ్చి మొక్కలు పెరగడం, మల్యాల మైదానంలో సగభాగం లెవల్ లేకపోవడం వంటి పరిస్థితిలు ఉన్నాయి. మల్లాపూర్ కళాశాల గుట్టపై ఉండడం వల్ల మైదానం ఏర్పాటు చేయడం కుదరడం లేదని అంటున్నారు.

పాఠశాల స్థాయి మెరికలకు కళాశాలల్లో నిరుత్సాహం...

ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల్లో ఫీజుల భారం భరించే స్థోమత లేని పేద విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరుతున్నారు. ప్రైవేటు, గురుకులాల్లో వ్యాయామ అధ్యాపకులు ఉండగా, ప్రభుత్వ కళాశాలల్లో పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. జిల్లాలోని ప్రభుత్వ

మిగతా 8వ పేజీలో

పోస్టులు భర్తీ చేయాలి

డాక్టర్ పోతరవేణి తిరుపతి, ప్రధాన కార్యదర్శి తెలంగాణ గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్-711,జగిత్యాల



జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న ఫిజికల్ డైరెక్టర్ పోస్టులు భర్తీ చేయాలి. ఇటీవల కళాశాలల్లో ఆటవస్తువుల కొనుగోలుకు ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించింది. కళాశాలల్లో ప్రతీ శనివారం టైంటేబుల్‌లో విద్యార్థుల ఆటలకు ఒక ప్రత్యేక పీరియడ్ కేటాయిస్తున్నారు. కానీ ఏ ఒక్క ప్రభుత్వ కళాశాలలోనూ ఫిజికల్ డైరెక్టర్ పోస్టును భర్తీ చేయకపోవడం బాధాకరం.

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం

బొప్పరాతి నారాయణ, జిల్లా ఇంటర్ విద్య అధికారి



జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఫిజికల్ డైరెక్టర్లు లేకపోవడంతో ఎదురవుతున్న ఇబ్బందుల్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పీడీల నియామకాల అంశం ఉన్నతాధికారుల దృష్టిలో ఉంది. ప్రస్తుతానికి క్రీడల్లో ప్రతిభ ఉన్న వారికి ఇబ్బందులు తలెత్తకుండా చూస్తున్నాం. పోటీల్లో పాల్గొనే వారికి అవసరమైన ప్రోత్సాహాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

కోటేశ్వర స్వామిని దర్శించుకున్న జడ్జి

వెల్గటూర్, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): కార్తీక పూర్ణిమ సందర్భంగా జిల్లా జడ్జి నారాయణ బుధవారం కోటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. మాజీ ఎంపీపీ పొనుగోటి శ్రీనివాస్‌రావు దంపతులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ఈవో కాంతారెడ్డి, ఆలయ చైర్మన్ పూదరి రమేష్‌లు వారిని సత్కరించారు. ఆలయ అర్చకులు నాగరాజు శర్మ, సంజీవ్ శర్మ, అన్వేష్ శర్మలు స్వామి వారి శేషవస్త్రం కప్పి ఆశీర్వచనాలు అందజేశారు. వెల్గటూర్‌లోని శ్రీ రామ భక్తాంజనేయస్వామి ఆలయంలో కార్తీక పూర్ణిమ వేడుకలు, అన్నదానం నిర్వహించారు.

రేపు హాకీ మ్యాచ్

జగిత్యాల టౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) : కోరుట్లలో శుక్రవారం 100 సంవత్సరాల హాకీ సంబరాలను పురస్కరించుకొని హాకీ మ్యాచ్ నిర్వహిస్తున్నట్లు జగిత్యాల జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చెట్‌పల్లి సుధాకర్, ఎం.అరుణ్ కుమార్ తెలిపారు. బుధవారం వారు మాట్లాడుతూ నవంబరు 7న హాకీ ఇండియా ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా హాకీ 100 సంవత్సరాల సంబరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు గంగాధర్, మిట్టపెల్లి దానేష్, చెట్‌పల్లి సరిత, తదితరులు పాల్గొన్నారు.

సౌదీలో రాయికల్‌వాసి మృతి

రాయికల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణానికి చెందిన సుతారి ధర్మయ్య (48) అనే గల్ఫ్ కార్మికుడు సౌదీ అరేబియాలోని జిద్దాలో రోడ్డును దాటుతుండగా వాహనం ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు బుధవారం కుటుంబసభ్యులకు సమాచారం అందింది. భీమన్నవాడకు చెందిన ధర్మయ్య 15 ఏళ్లుగా ఉపాధి కోసం సౌదీ వెళ్తున్నాడు. మృతుడికి భార్య, కొడుకు, కుమార్తె ఉన్నారు. మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకు వచ్చేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని బంధువులు కోరుతున్నారు.

సన్న వడ్లకు బోనస్ విడుదల చేయాలి

రాయికల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గత రబీ సీజన్ కొనుగోలు కేంద్రాల్లో ప్రభుత్వానికి రైతులు అమ్మిన సన్న వడ్లకు బోనస్ వెంటనే విడుదల చేయాలని రైతు నాయకుడు మెక్కొండ రాంరెడ్డి కోరారు. సన్న వడ్లు దిగుబడి రాదని తెలిసి రూ.500 బోనస్ దృష్టిలో పెట్టుకుని వేసంగిలో సాగు చేసిన రైతులకు ఇప్పటివరకు అందలేదన్నారు. ఈ ఖరీఫ్‌లో సన్న వడ్లు సాగు చేసిన రైతులకు కొనుగోలు కేంద్రాలను మూడు, నాలుగు గ్రామాలకు ఒకటి చొప్పున అందుబాటులో ఉండే విధంగా సెంటర్లను కేటాయించాలని ఆయన కోరారు.

ఇసుక లారీ పట్టివేత

కథలాపూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తక్కళ్ళపల్లి శివారులోని పెద్ద వాగు నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని బుధవారం పట్టుకున్నామని ఎస్సై నవీన్ కుమార్ తెలిపారు. ఆర్మూర్ పట్టణానికి చెందిన సిద్ధూ అనే వ్యక్తి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నట్లు వచ్చిన సమాచారం మేరకు పట్టుకుని కేసు నమోదు చేశామన్నారు.

ఆరుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

ధర్మపురి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పేకాట స్థావరంపై జగిత్యాల జిల్లా సీసీఎస్ పోలీసులు బుధవారం దాడి చేసి ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. పక్కా సమాచారం మేరకు జగిత్యాల సీసీఎస్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది దాడి చేసి పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. అలాగే వారి వద్ద రూ.4200 స్వాధీనం చేసుకున్నారు.

రూ.200 కోట్లతో త్వరలో ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం


ఎల్వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్

జగిత్యాల అర్బన్, నవంబర్ 5 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలో రెండు వందల కోట్ల రూపాయలతో తలపెట్టిన ప్రభుత్వ ప్రధానాసుపత్రి నిర్మాణానికి త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ తెలిపారు. బుధవారం జగిత్యాల నియోజక పట్టణంలోని నలుగురికి ముఖ్యమంత్రి ద్వారా మంజూరు చేయించిన 10 లక్షల 25 వేల రూపాయల ఎల్వోసీలను ఆయన పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగిత్యాల జిల్లాతో పాటు చుట్టూ ఉన్న నాలుగు జిల్లాల ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా అన్ని సౌకర్యాలతో ఈ ఆసుపత్రి నిర్మించనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో పాటు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి రాజనర్సింహలతో భూమి పూజ చేయించనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. తీవ్రమైన అనారోగ్యం బారిన పడి ఖరీదైన వైద్యం చేయించుకోలేని స్థితిలో ఉన్న వారికి ఎల్వోసీతో ఖరీదైన వైద్యం అందిస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వ హయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ వద్ద నుంచి కొత్త ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వద్ద నుంచి పేదవారి వైద్యానికి కావాల్సిన ఎల్వోసీలను అందజేస్తున్నామన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటు కాగానే ముఖ్యమంత్రి పెండింగ్‌లో ఉన్న కోట్లాది రూపాయల ఎల్వోసీ డబ్బులను విడుదల చేశారని పేర్కొన్నారు. ఇప్పటికి నియోజక వర్గంలో నిత్యం ఎల్వోసీ మంజూరు చేస్తూనే ఉన్నామన్నారు. వృత్తి రిత్యా వైద్యుడిని కనుక నాకు ఈ ప్రాంత ప్రజల జీవన స్థితిగతులపై పూర్తి అవగాహన ఉందన్నారు. అందుకు తగ్గట్టు ప్రజలకు కావాల్సిన వైద్య సేవలు అందించడం కోసం తాను తాపత్రేయ పడుతున్నానని తెలిపారు. జగిత్యాలను మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దేం దుకు శకి వంచన లేకుండా కృషి చేస్తున్నా నని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్మూళ్ళ పవన్, గంగారాం, రవి, మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మల్యాల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మల్యాల మండలంలోని పలు గ్రామాలకు చెందిన 146 మందికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.37.58లక్షల విలువైన చెక్కులను బుధవారం మండల కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్‌పర్సన్ బత్తిని మల్లీశ్వరీ శ్రీనివాస్‌గౌడ్, విండో చైర్మన్ రాంలింగారెడ్డి, ఆనందరెడ్డి, ఆదిరెడ్డి, వెల్మ లక్ష్మారెడ్డి, మ్యాక లక్ష్మన్, తిరుపతి, సతీశ్‌రెడ్డి, ఇంద్రసేనారెడ్డి, మంద తిరుపతి, హన్మంతు, బండి రవి, అనిల్,వెంకన్న, సురేశ్, శ్రీనివాస్, కిషన్‌రెడ్డి, శ్రీకాంత్ పాల్గొన్నారు.

'కరాటేతో ఆత్మవిశ్వాసం పెంపు'

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ ఆత్మరక్షణ విద్య పట్ల ఆసక్తిని పెంచుకొని, నేర్చుకోవాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. జగిత్యాల పవన్ కరాటే అకాడమీ డిసెంబరు 7న సెకండ్ స్టేట్ లెవల్ ఓపెన్ కరాటే ఛాంపియన్‌షిప్ 2025 పోస్టర్‌ను ఎమ్మెల్యే చేతులమీదుగా ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా కరాటే చైర్మెన్ లింగయ్య, ఆర్గనైజర్ ఆరుముళ్ల పవన్, కో ఆర్గనైజర్ గంగాధర్, ఆకాష్ మహోదయ్, రాకేష్ ఉన్నారు.

● ఈనెల 7నుంచి 9వ తేదీ వరకు గీతా విద్యాలయం మైదానంలో జరగనున్న ఇంటర్ డిస్ట్రిక్ సాఫ్ట్‌బాల్ ఛాంపియన్‌షిప్ 2025-26 ప్రారంభ కార్యక్రమానికి హాజరుకావాలని నిర్వాహకులు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు ఆహ్వానపత్రికను అందజేశారు. కార్యక్రమంలో జగిత్యాల సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ వెంకటేష్, యూత్ నాయకులు ఎంఏ ఆరిఫ్ తదితరులున్నారు.

ఆలయ భూముల పరిరక్షణ అందరి బాధ్యత


రాముల వారికి ఆభరణాలు తీసుకు వస్తున్న మాజీ మంత్రి జీవన్‌రెడ్డి, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ వసంత

జగిత్యాల అర్బన్ నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆలయ భూముల పరిరక్షణ అందరి బాధ్యత అని మాజీ మంత్రి జీవన్ రెడ్డి అన్నారు. బుధవారం కార్తీక పౌర్ణమిని పురస్క రించుకొని జగిత్యాల పట్టణంలోని దరూర్ క్యాంప్‌లోగల కోదండ రామస్వామి వారికి భక్తులు విరాళాలతో చేయించిన వెండి ఆభరణాలు శ్రీ రామచంద్ర స్వామి వారికి కిరీటంచ ధనుస్సు, ఖడ్గం, సీతమ్మ వారికి హారం తదితర ఆభరణాలను మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ దావ వసంతతో కలిసి సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగిత్యాల పట్టణంలోని కోదండ రామచంద్రస్వామి ఆలయం, విద్యానగర్‌లోని రామచంద్ర స్వామి ఆలయాలకు 20 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయని త్వరలో పనులు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో ఎలిగేటి నర్సయ్య, పిడుగు ప్రభాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్ రావు, గుండా మధు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యనారాయణస్వామి జాతర


పూజలు చేస్తున్న భక్తులు

కథలాపూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కథలాపూర్ మండలంలోని కలికోటలో బుధవారం సత్యనారాయణస్వామి జాతర ఘనంగా జరిగింది. కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని సామూహిక వ్రతాలు మహిళలు నిర్వహించారు. అనంతరం శ్రీరమాదేవి సత్యనారాయణ స్వామి కళ్యాణోత్సవం వేద పండితులు సీతారామ శాస్త్రి ఆధ్వర్యంలో కన్నుల పండవగా నిర్వహించారు. ఈ జాతరకు అంబారిపేట, కలికోట, పోతారం, ఇప్పపల్లి, తాండ్ర్యాల, తుర్తి వంటి గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించు కునేందుకు క్యూ కట్టారు. భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు. వేములవాడ బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావుకు పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలకగా ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, గడ్డం భూమారెడ్డి, మాజీ ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ దేవేందర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మామిడిపల్లి రవి, ముస్కూరి కిరణ్, గడీల గంగప్రసాద్, సీతారాం, గంగారెడ్డి, నిర్వాహకులు పాల్గొన్నారు.

గురునానక్ బోధనలు ఆచరణీయం


గురునానక్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్న భారత్ సురక్షా సమితి

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): గురునానక్ బోధనలు ఆచరణీయమని భారత్ సురక్షా సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్ రాజు అన్నారు. గురునానక్ జయంతిని పురస్కరించుకొని పట్టణంలోని స్థానిక తహసీల్ చౌరస్తా వద్ద సిక్కు మతస్థాపకులు గురునానక్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సేవాభావంతో జీవితాన్ని గడపాలని గురునానక్ బోధించారన్నారు. గురునానక్ ప్రవచించిన ప్రేమ, కరుణ మానవతా సందేశాలు అందరినీ సరైన మార్గంలో నడిపిస్తాయన్నారు. ఆయన జీవితం సమాజానికి ఆదర్శనీయం అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో భారత్ సురక్షా సమితి బాధ్యులు కాశీనాథం, గంగాధర్, శ్రీనివాస్, బొందుకూరి శ్రీనివాస్, దేవరాజం, భూమన్న, గంగాధర్, బాలన్న, మల్లిఖార్జున్ తదితరులున్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు నిలిపివేయాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కథలాపూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న 220/132 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు నిలుపుదల చేయాలని కోరుతూ బుధవారం పలువురు నాయకులు తహసీల్దార్ వినోద్‌కు వినతిపత్రం అందజేశారు. పక్కనే కళాశాలలు ఉన్నందు వల్ల విద్యుత్ రేడియేషన్‌తో విద్యార్థులకు భవిష్యత్‌లో పలు రకాల ఇబ్బందులు తలెత్తుతాయని పేర్కొన్నారు. లోలైన ప్రాంతం కావడం వల్ల వర్షాకాలంలో అవస్థలు తప్పవని అన్నారు. ఈ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను మరో ప్రాంతంలో నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు కథలాపూర్ మహేశ్, గసికంటి వేణు, ప్రసాద్, యువకులు ఉన్నారు.

ఘనంగా లక్ష్మీ నరసింహస్వామి కల్యాణం


కల్యాణంలో పాల్గొన్న భక్తులు

భీమారం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): భీమారం మండల కేంద్రంలో బుధవారం శ్రీ లొంక వెంకట లక్ష్మీ నరసింహస్వామి కల్యాణ వేడుకలు ఘనంగా జరిగాయి. పండితుల వేద మంత్రోచ్ఛరణల మధ్య యజ్ఞం, హోమం కార్యక్రమాలు కన్నుల పండువగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సై శ్రీధర్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ గుండేటి సత్యనారాయణ, గుగ్గిల్ల రవి గౌడ్, బద్ది లక్ష్మణ్, పల్లి అర్జున్, చెక్కపెల్లి సంజీవ్, చెక్కపెల్లి రఘు, ఉత్కం శంకర్ గౌడ్, దామెర పరమేశ్, చెక్కపెల్లి శంకర్, దురుశెట్టి భూమాచారి పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో గిరి ప్రదక్షిణ


కిషన్‌రావుపేటలో గిరి ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

వెల్గటూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కిషన్‌రావుపేట శ్రీ నాగపల్లి లక్ష్మి నర్సింహస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం గిరి ప్రదక్షిణ కార్యక్రమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారి చిత్ర పటాన్ని అందంగా అలంకరించి శావపై నిలిపి అంగరంగ వైభవంగా గిరి ప్రదక్షిణ నిర్వహించారు. కిషన్‌రావుపేట, పరిసర గ్రామాల భక్తులు స్వామి వారి గోవింద నామాలు జపిస్తూ గిరి ప్రదక్షిణలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కొడిమ్యాల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కొడిమ్యాల మండలం పూడూర్ గ్రామ శివారులో నిర్మిస్తున్న రామాలయం నిర్మాణానికి బుధవారం దాతలు విరాళాలు అందించారు. మండలంలోని గౌరాపూర్ గ్రామానికి చెందిన బండ శ్రీలతశ్రీనివాస్‌రెడ్డి 11,116 రూపాయలు, కరీంనగర్ పట్టణానికి చెందిన కరండ్ల లక్ష్మీశంకరయ్య 11,116 రూపాయలను విరాళంగా అందించినట్లు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు తెలిపారు. దాతలకు ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆన్‌లైన్‌లో రూ.1.15లక్షల సైబర్ మోసం

- ఆకర్శణీయ వస్తువుల పేరుతో మహిళకు టోకరా

వేములవాడ టౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాల ద్వారా ఆకర్షణీయమైన వస్తువులను తక్కువ ధరకే అందిస్తామంటూ మోసానికి పాల్పడుతున్న సైబర్ నేరస్థుల వలకు చిక్కి వేములవాడ పట్టణంలోని ఓ మహిళ మోసపోయింది. ఈ సంఘటనపై బాధిత మహిళ భర్త కొమ్ము నటరాజ్ స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... సామాజిక మాధ్యమంలో రూ. 999 కే ఆకర్షణీయమైన వస్తువులు విక్రయిస్తున్నట్లు ముందుగా పోస్ట్‌పెట్టారు. అది చూసిన బాధిత మహిళ సదరు నంబర్‌కు రూ.999 పంపింది. తర్వాత పలు దఫాలుగా ఆమె నుంచి మరి కొంత డబ్బులు రాబట్టారు. చాటింగ్ ద్వారా బాధిత మహిళ ఫోన్‌ను హ్యాక్ చేసి ఆమె ఖాతాలో ఉన్న రూ.1.15లక్షలు నగదు కాజేశారు. దీంతో బాధిత మహిళ పోలీసులను ఆశ్రయించింది.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్యాయత్నం

కోనరావుపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : ఆర్థిక ఇబ్బందులతో ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలోని నిమ్మపల్లి గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మ్యాదరి మధుకర్ (48) ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతూ బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డిపేటలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. బాధితుడికి భార్య రాధిక ఉన్నారు.

వృద్ధుడి ఆత్మహత్య

ఓదెల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని భీమరపల్లిలో మంగళవారం రాత్రి భీమరి భూమయ్య(87) అనే వృద్ధుడు ఇంటిలో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్‌ఐ కిషన్ తెలిపారు. భూమయ్య ఐదేళ్ల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నాడు. జీవితంపై విరక్తిచెందిన భూమయ్య మంగళవారం రాత్రి తన ఇంటిలో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అందని టార్పాలిన్లు

- అకాల వర్షాలకు కొనుగోలు కేంద్రాల్లో తడుస్తున్న ధాన్యం
- ఇబ్బందులు పడుతున్న రైతులు



ఎండపల్లి మండలంలోని కొనుగోలు కేంద్రంలో ఆరబోసిన ధాన్యం

ఎండపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చాక అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు అవసరమైన టార్పాలిన్లు లేక రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఓ వైపు మొంథా తుఫాన్ వల్ల కొన్ని గ్రామాల్లో వరి నేల మట్టం కాగా మరికొన్ని గ్రామాల్లో ధాన్యం తడిసి మొలకెత్తింది. ఎండపల్లి మండ కేంద్రంలో 20 రోజుల క్రితం వరి కోతలు ప్రారంభం అయ్యాయి. రైతులు నేరుగా



మార్కెట్‌లోకి ధాన్యాన్ని తరలిస్తున్నారు. మండలంలోని కొన్ని గ్రామాల్లో సొసైటీల ద్వారా, మరి కొన్ని గ్రామాల్లో ఐకేపీల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను నిర్వహిస్తున్నారు. మార్కెట్‌ల ద్వారా వచ్చిన కమీషన్‌తో టార్పాలిన్లు సమకూర్చాల్సి ఉన్నా అందించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో రైతుల అవసరాలను గుర్తించిన కాంగ్రెస్ ప్రభుత్వం సబ్సిడీపై వ్యవసాయశాఖ ద్వారా 50 నుంచి 60 శాతం రాయితీపై అందించేది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఈ పథకం నిలిచిపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

●రైతులపై ఆర్థిక భారం

ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 60శాతం సబ్సిడీతో 1000 రూపాయలకే టార్పాలిన్ అందించేది. అనంతరం ఈ పథకం నిలిచిపోవడంతో రైతులపై అదనపు ఆర్థిక భారం పడుతోంది. రైతులు పంటను కాపాడుకునేందుకు అత్యవసర పరిస్థితుల్లో వేరే రాష్ట్రం నుంచి వచ్చిన వ్యాపారుల వద్ద టార్పాలిన్లను రోజుకు 30 నుంచి 40 రూపాయలు చెల్లించి రైతులు అద్దెకు తీసుకుంటున్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించి రైతులకు సబ్సిడీపై టార్పాలిన్లు అందించాలని పలువురు అన్నదాతలు కోరుతున్నారు.

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం

-ఏవో మహేష్, ఎండపల్లి మండలం

రాయితీపై టార్పాలిన్లను అందించాలని రైతులు కోరుతున్నారు. పథకం రద్దయినట్టు రైతులకు చెబుతున్నా రాయితీపై టార్పాలిన్లు కావాలని అడుగుతున్నారు. ప్రభుత్వం మంజూరు చేస్తే రైతులకు అందిస్తాం. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడికి గాయాలు

ఫైటింక్లయిన్‌కాలనీ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): డ్యూటీకి వెళ్తున్న సింగరేణి కార్మికుడిని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో గాయాలపాలయ్యాడు. గోదావరిఖని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కోట ప్రదీప్‌కుమార్ (27) గాయపడ్డాడు. మంచిర్యాలకు చెందిన అడ్రియాల ప్రాజెక్టులో ప్రదీప్‌కుమార్ బదిలీవర్కర్‌గా పనిచేస్తున్నాడు. ఉదయం తన ద్విచక్ర వాహనంపై గనికి వెళ్తున్న క్రమంలో సుందిల్ల మూలమలుపు వద్ద మంథని నుంచి గోదావరిఖనికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొన్నది. ఈ ప్రమాదంలో ప్రదీప్ కుమార్ తీవ్రంగా గాయపడ్డాడు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి

వీణవంక, నవంబరు5(ఆంధ్రజ్యోతి): మండలంలోని మామిడాలపల్లి గ్రామ పరిధిలోని గొల్లపల్లికి చెందిన బోయిని లచ్చమ్మ (94) అనే వృద్ధురాలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. పోలీసుల వివరాల ప్రకారం.. గతంలో లచ్చమ్మ కొడుకు మృతి చెందడంతో బాధతో ఉండేది. అక్టోబర్ 27వ తేదీన కొడుకు సమాధి వద్దకు వెళ్లి అక్కడే కార్ పాలిష్ తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రితో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది.

విద్యార్థులకు గడ్డి మందు ఎక్కడిది ?

విచారణ చేపట్టిన అధికారులు

జమ్మికుంట రూరల్, నవంబరు 05 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంటలోని ఎస్సీ పాఠశాలకు చెందిన ఇద్దరు తొమ్మిదవ తరగతి విద్యార్థులు ప్రిన్సిపాల్ కొట్టాడని గడ్డి మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడిన ఘటనలో విద్యార్థులకు గడ్డి మందు ఎక్కడి నుంచి వచ్చిందనే కోణంలో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ప్రస్తుతం విద్యార్థులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విద్యార్థులు మాత్రం పాత వ్యవసాయ మార్కెట్ రోడ్డులోని ఓ ఫర్టిలైజర్ దుకాణంలో గడ్డి మందు కొనుగోలు చేశామని పోలీస్‌లకు తెలిపారు. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్ ఆగ్రహంగా ఉన్నట్లు తెలిసింది. ఇప్పటికే ఫర్టిలైజర్ దుకాణదారుడిని గుర్తించినట్లు సమాచారం. విద్యార్థులు కోలుకున్న వెంటనే ఫర్టిలైజర్ దుకాణదారుడిని పోలీస్‌లు అదుపులోకి తీసుకోనున్నట్లు తెలిసింది.

కిడ్నాప్ కలకలం

- కూతురి కిడ్నాప్‌నకు యత్నం.. తల్లిదండ్రులపై కేసు



బాధితురాలు ప్రియాంక

జగిత్యాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం రాజారాంపల్లి వద్ద బుధవారం కిడ్నాప్ కలకలం రేపింది. తన తల్లిదండ్రులు కిడ్నాప్ చేయడానికి ప్రయత్నించారని ఆరోపిస్తూ బుధవారం ఓ యువతి వెల్గటూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. బాధితురాలి కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం బసంత్‌నగర్‌కు చెందిన తమ్మిశెట్టి ప్రియాంక అనే యువతి జగిత్యాల జిల్లా వెల్గటూరు మండలం రాజక్కపల్లి గ్రామానికి చెందిన మర్రి రాకేశ్ అనే యువకుడు ఆరు సంవత్సరాలుగా ప్రేమించుకుంటున్నారు. కులాలు వేరు కావడంతో వీరి ప్రేమను ప్రియాంక తల్లిదండ్రులు అంగీకరించలేదు. దీంతో ఈ సంవత్సరం జూలై 27వ తేదీన ప్రియాంక, రాకేశ్‌లు పెద్దలను ఎదిరించి వివాహం చేసుకున్నారు. అయితే రాకేశ్ వేరే కులానికి చెందిన వాడు కావడంతో ప్రి యాంక తల్లిదండ్రులు ఈ వివాహాన్ని వ్యతిరేకించారు. ప్రియాంక రాజక్కపల్లిలోని అత్తగారి ఇంట్లో భర్త రాకేశ్‌తో కలిసి ఉంటోంది. ప్రియాంకతో ఆమె తల్లిదండ్రులు తరచూ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ యోగక్షేమాలు తెలుసు కుంటున్నారు. గర్భవతి అయిన ప్రియాంకను ఆసుపత్రిలో చూపిస్తామని తల్లిదండ్రులు నమ్మించారు. బుధవారం జగిత్యాల ఆసుపత్రిలో ప్రియాంకకు ఆరోగ్య పరీక్షలు చేయించారు. తిరుగు ప్రయాణంలో ఎండపల్లి మండలం రాజారాంపల్లి వద్ద దిగి రాజక్కపల్లి గ్రామానికి వెళ్లడానికి మరో బస్సు కొరకు వేచి ఉన్నారు. ఆ సమయంలో ముందుగా వేసుకున్న పథకం ప్రకారం ప్రియాంకను ఓ సమీప బంధువుతో కలిసి తల్లిదండ్రులు కిడ్నాప్ చేయడానికి ప్రయత్నించారు. వెంటనే అప్రమత్తమైన ప్రియాంక స్థానికుల సహాయంతో తప్పించుకుంది. తల్లిదండ్రులతో తనకు, భర్త రాకేశ్‌కు ప్రాణహాని ఉందని ప్రియాంక ఆవేదన వ్యక్తం చేసింది. ప్రియాంక ఇచ్చిన ఫిర్యాదు మేరకు తల్లిదండ్రులు తమ్మిశెట్టి పద్మ, తమ్మిశెట్టి వెంకటేశ్, బాధితురాలి అక్క భర్త గుంజె కుమార్‌లపై వెల్గటూరు ఎస్ఐ ఉమాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యత వారసులదే

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల సంరక్షణ బాధ్యత వారసులదే అని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్‌ను పేర్కొన్నారు. జిల్లా కేంద్రంకు చెందిన కంచెటి నారాయణ, నర్సమ్మ దంపతులను వారి కుమారులు పట్టించుకోవడం లేదు. దీంతో వృద్ధులు హరిఅశోక్‌కుమార్‌ను కలువగా రాత్రి తన ఇంట్లోనే ఆశ్రయం కల్పించారు. మరుసటి రోజు బుధవారం ఉదయం నర్సమ్మ, నారాయణ కుమారులను, కోడళ్లను అసోసియేషన్ కౌన్సిలింగ్ కేంద్రానికి పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆ వృద్ధ దంపతుల కొడుకులు, కోడళ్లు క్షమాపణ చెప్పి, సమ్మతి పత్రంను అసోసియేషన్‌కు రాసిచ్చి వారిని ఇంటికి తీసుకొని వెళ్లారు. తమ న్యాయం చేసిన అసోసియేషన్ అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ వారు కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీరాంసాగర్‌కు తగ్గిన వరద

జగిత్యాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరద నీరు రావడం బుధవారం తగ్గుముఖం పట్టింది. ఎగువ ప్రాంతం నుంచి 21,954 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. 4 వరద గేట్లు ఎత్తి దిగువ గోదావరిలోకి 12,500 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 80.5 టీఎంసీలకు ప్రస్తుతం 80.501 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కాకతీయ కాలువ, సరస్వతీ కాలువ, మిషన్ భగీరథ, వరద కాలువ, ఇతరములకు కలిపి ప్రాజెక్టు నుంచి 28,204 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఇందులో ఎస్కేప్ గేట్ల ద్వారా 8 వేలు, సరస్వతీ కాలువకు 650, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



గాయపడ్డ వీరాస్వామి, రామిరెడ్డి

సుల్తానాబాద్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీరుకుల్ల బ్రిడ్జిపైన బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు అయ్యప్పభక్తులు తీవ్రంగా గాయపడ్డారు. బైక్‌పై వస్తున్న అయ్యప్పభక్తులను కారు ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. మానకొండూరు మండలం వేగురుపల్లి గ్రామానికి చెందిన బత్తిని వీరస్వామి, నందికొండ రాంరెడ్డి అయ్యప్పమాల వేసుకోవడానికి బుధవారం ఉదయం లక్షెట్‌పేట సమీపంలోని గూడెంగుట్టకు వెళ్లారు. అక్కడ మాల వేసుకుని వేగురుపల్లికి తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో సుల్తానాబాద్ మండలం నీరుకుల్ల బ్రిడ్జి మీద కారు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వీరస్వామికి, రామిరెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే వారిని 108ద్వారా సుల్తానాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కాగా వీరస్వామికి తలకు తీవ్ర గాయాలై, మోకాలు కిందభాగం దెబ్బతినగా, రామిరెడ్డికి కుడి కాలు తొంటి విరిగింది. మెరుగైన చికిత్స కోసం వారిని కరీంనగర్‌కు తరలించారు. సంఘటన స్థలాన్ని పోలీసులు సందర్శించి, ప్రమాద కారణాలు తెలుసుకున్నారు.

జీవితంపై విరక్తి చెంది మహిళ ఆత్మహత్య

జూలపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోనరావుపేట గ్రామానికి చెందిన గుండ లలిత(45) అనే మహిళ తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది బుధవారం ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్థులు, పోలీసులు అందించిన సమాచారం మేరకు.. గుండ లలిత మూడేళ్ల క్రితం తీవ్రమైన అనారోగ్యానికి గురైనది. ఎన్ని ఆసుపత్రులు తిరిగినా నయం కాకపోవడంతో ఆమెరోజు ఆందోళనకు గురయ్యేది. ఇక తన ఆరోగ్యం బాగుపడదేమోనని బాధతో జీవితంపై విరక్తి చెందిన లలిత వాష్‌రూంకు వెళ్లివస్తానని ఇంట్లో చెప్పి వెళ్లింది. ఎంతకూ రాకపోవడంతో కుటుంబసభ్యులు వెళ్లి చూడగా సమీపంలోని బావిలో దూకి ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతురాలు భర్త గుండ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సనత్‌కుమార్ పేర్కొన్నారు.

పోలీసుల అదుపులో జ్యూవెల్లరీ దొంగ

- బంగారం, వెండి, ఆటో, నగదు స్వాధీనం



నిందితుడి అరెస్ట్ చూపుతున్న పోలీసులు

జమ్మికుంట రూరల్, నవంబరు 05 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని జ్యూవెల్లరీ షాపుల్లో దొంగతానికి పాల్పడిన ఓ దొంగను పోలీస్‌లు అదుపులోకి తీసుకున్నారు. బుధవారం జమ్మికుంట పోలీస్‌స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పట్టణ సీఐ ఎస్ రామకృష్ణగౌడ్‌తో కలిసి హుజూరాబాద్ ఏసీపీ మాధవి దొంగతనానికి సంబంధించిన వివరాలు వెల్లడించారు. జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని మోత్కుల గూడెంకు చెందిన సోమ సారయ్య 2010లో తన భార్యను హత్య చేసిన సంఘటనలో జీవిత ఖైదు పడింది. జైల్లో తోటి ఖైదీలతో దొంగతనాలు చేసి సులభంగా డబ్బు సంపాధించవచ్చని తెలుసుకున్నాడు. సత్ప్రవర్తన కింద బయటకు వచ్చాడు. ప్యాసింజర్ ఆటో కొనుగోలు చేసి జీవనోపాధి పొందుతున్నాడు. ఆటో ద్వారా వచ్చే డబ్బులు సరిపోకపోవడంతో దొంగతనం చేయాలని నిశ్చయించుకున్నాడు. ఇటీవల జమ్మికుంటలో రెండు జ్యూవెల్లరీ షాపులు, స్కూళ్లలో దొంగ తనాలు జరిగాయి. పోలీస్‌లు తనిఖీలు చేపడుతుండగా అనుమానాస్పద స్థితిలో సారయ్య పట్టుబడ్డాడు. పోలీసులు ప్రశ్నించగా చేసిన దొంగతనాలు ఒప్పుకున్నాడు. అతడి వద్ద నుంచి కిలోన్నర వెండి, ఐదు తులాల భంగారం, రూ.38వేల నగదు, ప్యాసింజర్ ఆటో స్వాధీనం చేసుకున్నారు. అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

తల్లిదండ్రులకు బాలుడి అప్పగింత

కరీంనగర్ క్రైం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి పారిపోయిన అస్సాంకు చెందిన బాలుడి(17)ని కరీంనగర్ బాలల సంక్షేమ సమితి (సీడబ్ల్యూసీ), శిశు సంక్షేమ అధికారులు బుధవారం తల్లితండ్రులకు అప్పగించారు. అక్టోబరు 31న అస్సాంకు చెందిన బాలుడు ఇంట్లో గొడవలతో పారిపోయి కరీంనగర్ వచ్చాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు చైల్డ్ హెల్ప్‌లైన్ నంబరు 9490881098కు ఫోన్ చేసి సమాచారం అందించారు. వారి కుమారుడు కొత్తపల్లి మండలం బావుపేట గ్రానైట్ క్వారీలో ఉన్నట్టు తెలిపారు. వెంటనే సీఐ కోటేశ్వర్ సహాయంతో బాలుడినిని రెస్క్యూ చేసి బాలల సంక్షేమ సమితి ఎదుట హాజరు పరిచారు. బుధవారం ఉదయం తల్లిదండ్రులకు అప్పగించారు. కార్యక్రమంలో బాలల సంక్షేమ సమితి సభ్యులు రేండ్ల కళింగ శేఖర్, రాధ, విజయ్, డీసీపీవో పర్వీన్, చైల్డ్‌హెల్ప్ లైన్ 1098 జిల్లా కోఆర్డినేటర్ సంపత్, వర్కర్ మహేష్, సీడబ్ల్యూసీ డీఈవో అనూష,ఓపెన్ షెల్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీపై కేసు నమోదు



క్లినిక్‌ను తనిఖీ చేస్తున్న తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు(ఫైల్)

తిమ్మాపూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోరండ్ల గ్రామంలో ఆర్‌ఎంపీ కాసం రవీందర్‌రెడ్డి తగిన అర్హత లేకున్నా చట్ట విరుద్ధంగా క్లినిక్‌ను ఏర్పాటు చేసుకుని వైద్యం అందిస్తున్నాడని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ యెగ్గని శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎల్‌ఎండీ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదు చేశారు. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఈ ఏడాది జూలై 5న నిర్వహించిన తనిఖీల్లో పోరండ్ల గ్రామంలో కాసం రవీందర్ రెడ్డి ఎంబిబి ఎస్ అర్హత లేకుండా చట్ట విరుద్ధంగా క్లినిక్ నడపుతున్నట్లు తేలింది. దీంతో అతనిపై జాతీయ వైద్య కమిషన్ చట్టం 2019(ఎన్‌ఎంసి యాక్ట్), రాష్ట్ర వైద్య చట్టాల ప్రకారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎల్‌ఎండీ ఎస్సై శ్రీకాంత్ గౌడ్ తెలిపారు. నకిలీ వైద్యులను అరికట్టే దిశలో ఇది కీలకమైన అడుగు అని తెలంగాణ మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్.శ్రీనివాస్ తెలిపారు. తెలంగాణ మెడికల్ కౌన్సిల్ లేదా ఎన్‌ఎంసీలో నమోదు పొందిన వైద్యులకే వైద్యం చేయడానికి హక్కు ఉందని, ప్రజలు, అధికార యంత్రాంగం అర్హత లేని వైద్యుల గురించి వెంటనే నివేదించాలంటూ ఆయన విజ్ఞప్తి చేశారు.

రాజన్న నిత్యాన్నదాన ట్రస్టుకు రూ. లక్ష విరాళం



విరాళం అందజేస్తున్న దంపతులు

వేములవాడ టౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): శ్రీరాజరాజేశ్వరస్వామి నిత్యాన్నదాన ట్రస్టుకు బుధవారం టీఎన్‌జీవో రాష్ట్ర కోశాధికారి ముత్యాల సత్యనారాయణగౌడ్, మాలతి దంపతులు బుధవారం ఆలయ కార్యాలయంలో ఒక లక్ష రూపాయల విరాళం ఆలయ పర్యవేక్షకులు సంజీవ్ కుమార్‌కు అందజేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు.

రోడ్డు వెంట ధాన్యం.. తప్పిన ప్రమాదం



ధాన్యం కుప్పపైకి దూసుకెళ్లిన ట్రాలీ

పెద్దపల్లి రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కనగర్తి గ్రామ శివారు వద్ద ధర్మారం- పెద్దపల్లి ప్రధాన రహదారిపై రైతులు ధాన్యాన్ని రోడ్డుపై ఆరబోయడంతో మంగళవారం రాత్రి ప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మారం మండల కేంద్రానికి చెందినవారు ట్రాలీలో పెద్దపల్లికి మొక్కజొన్నలు తీసుకెళ్లి విక్రయించి రాత్రి సమయంలో తిరిగి ఇంటికి వస్తున్నారు. ఈ క్రమంలో రోడ్డుపై ఆరబోసిన ధాన్యం కుప్ప వద్దకు చేరుకోగానే ఎదురుగా లారీ రావడంతో దానిని తప్పించే ప్రయత్నంలో ధాన్యం కుప్పపైకి ట్రాలీ దూసుకెళ్లింది. ట్రాలీలో ప్రయాణిస్తున్న వ్యక్తులకు గాయాలైనట్లు తెలిపారు. సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు రాలేదని పెద్దపల్లి రూరల్ పోలీసులు తెలిపారు.

ధాన్యం ఆరబోతలో వివాదం

- ముగ్గురిపై కేసు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రంలో ధాన్యం ఆరబోతకు ఇరు వర్గాల నడుమ చోటు చేసుకున్న స్థల వివాదంలో వీర్నపల్లి మండలం జవహర్‌లాల్‌నాయక్ తండాకు చెందిన మాలోతు నిర్మల, భూక్య మంజుల అతని భర్త రవిలపై కేసు నమోదు చేశామని ఎస్ఐ లక్ష్మణ్ బుధవారం తెలిపారు. గ్రామంలోని కొనుగోలు కేంద్రానికి మాలోతు నిర్మల, అదే గ్రామానికి చెందిన భూక్య మంజుల అతని భర్త రవిలు ధాన్యం ఆరబోసుకునేందుకు స్థలం కోసం గొడవకు దిగారు. ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ లక్ష్మణ్ వివరించారు.

పెన్షనర్ల బకాయిలు విడుదల చేయాలి



రేవా రాష్ట్ర అడ్‌హక్ కమిటీ బాధ్యులు

కరీంనగర్ టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ చేసిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రభుత్వం అందించాల్సిన ప్రయోజనాల బకాయిలను వెంటనే విడుదల చేయాలని రిటైర్డ్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ (రేవా) రాష్ట్ర కన్వీనర్ కోహెడ చంద్రమౌళి డిమాండ్ చేశారు. బుధవారం నిర్వహించిన రేవా రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మాట్లాడారు. 2024 మార్చి నుంచి ఇప్పటి వరకు పదవీ విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన జీపీఎఫ్, జీఐఎస్, లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్, కమ్యూటేషన్, గ్రాట్యూవిటీ వంటివి అందలేదన్నారు. ఉద్యోగ విరమణ పొందిన తర్వాత వెంటనే ఇవ్వాల్సిన బకాయిలు అందక పెన్షనర్లు ఇబ్బందులు పడుతున్నారన్నారు. బకాయిల కోసం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సంఘాలు ప్రభుత్వానికి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పెడచెవిన పెట్టడం దురదృష్టకరమన్నారు. ఉద్యోగ విరమణ బకాయిలు ఇచ్చే వరకు పోరాటం చేయాలని, అవసరమైతే ఆమరణ నిరాహార దీక్షకు కూడా వెనకాడబోమని స్పష్టం చేశారు. అనంతరం రేవా రాష్ట్ర అడ్‌హక్ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

- రేవా రాష్ట్ర కన్వీనర్‌గా కోహెడ చంద్రమౌళి (కరీంనగర్), కో కన్వీనర్లుగా భరత్ సత్యనారాయణ (హైదరాబాద్), సి.జయరాం (ఖమ్మం), ఎస్.ధర్మేంద్ర (వరంగల్), కోశాధికారిగా కె.భిక్షపతి (నల్గొండ) ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు.

అనారోగ్య కారణాలతో వృద్ధుడి ఆత్మహత్య



రాజయ్య (ఫైల్)

కోనరావుపేట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్య కారణాలతో ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కోనరావుపేట ఎస్సై ప్రశాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మామిడిపల్లికి చెందిన పెడతనపల్లి రాజయ్య(85) అనే వృద్ధుడు అనారోగ్య కారణాల వల్ల జీవితం మీద విరక్తి చెంది బుధవారం ఉదయం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు కనకయ్య పోలీస్‌స్టేషన్‌లో అనారోగ్య కారణాల వల్ల ఆత్మహత్య చేసుకున్నాడని ఫిర్యాదు చేశాడు. ఎస్సై ప్రశాంత్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతునికి భార్య, ఆరుగురు కుమారులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

కరీంనగర్ క్రైం, నవంబరు 5 (ఆంధ్ర జ్యోతి): అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను కరీంనగర్‌లోని తీగలగుట్టపల్లి రైల్వేగేట్ వద్ద బుధవారం పట్టుకున్నట్లు రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. వల్లంపహాడ్ శివారులోని వాగు నుంచి ఇసుకను తరలిస్తున్నారని పేర్కొన్నారు. డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ముత్తారం మండలం ఓడేడులో..

ముత్తారం: మండలంలోని ఓడేడు గ్రామంలో బుధవారం తెల్లవారుజామున అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌లను పట్టుకున్నట్లు ఎస్ఐ రవికుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఓడేడు గ్రామంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా రెండు ఇసుక ట్రాక్టర్లను ఆపి తనిఖీలను నిర్వహించారు. ఈ సందర్భంగా వారి వద్ద ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో పాటు ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. వెంటనే ట్రాక్టర్ల డ్రైవర్లను అదుపులోకి తీసుకుని విచారించారు. అనంతరం ట్రాక్టర్లను స్వాధీనం చేసుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి ట్రాక్టర్ల యజమానులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

11న అరుణాచలం, రామేశ్వరానికి
ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

కళ్యాణ్‌నగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని బస్ డిపో నుంచి ఈ నెల 11న అరుణాచలం, రామేశ్వరానికి రెండు ప్రత్యేక సూపర్‌లగ్జరీ బస్సులను ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ నాగభూషణం తెలిపారు. 11న మధ్యాహ్నం గోదావరిఖని బస్టాండ్ నుంచి బయలుదేరే ఈ బస్సులు కాణిపాకం, అరుణాచలం, శ్రీరంగం, పలని, పాతాళశంభు, మధురై, రామేశ్వరం, విష్ణుకంచి, శివకంచి, జోగుళాంబ పదియాత్రల దర్శనం అనంతరం 18న గోదావరిఖనికి చేరుకుంటుందని అన్నారు. ఈ యాత్రలకు పెద్దలకు రూ.8వేలు, పిల్లలకు రూ.6వేలు నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సర్వీసులకు 56789, 89898 నంబర్లతో రిజర్వేషన్‌లో ఉంచనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని గోదావరిఖని, పెద్దపల్లి, కరీంనగర్ ప్రాంతాల భక్తులు వినియోగించుకోవాలన్నారు. వివరాలకు 7382847596, 7013504982 నంబర్లలో సంప్రదించాలని ఆయన కోరారు.

మానవత్వం చాటుకున్న జమ్మికుంట పోలీసులు


వాహనంలో ధాన్యం బస్తాలు ఎక్కిస్తున్న ఎస్ఐ సతీష్, సిబ్బంది

జమ్మికుంట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జిపై నుంచి మార్కెట్ యార్డుకు ఓ రైతు ధాన్యం బస్తాలు తీసుకువెళ్తుండగా ట్రాక్టర్ అదుపుతప్పి బస్తాలు కింద పడిపోయాయి. అందరు చూస్తూ వెళ్తున్నారు తప్ప రైతులకు ఎవరూ సాయం చేయడం లేదు. విషయం తెలుసుకున్న పట్టణ సీఐ ఎస్ రామకృష్ణగౌడ్ వెంటనే స్పందించి ఎస్ఐ సతీష్‌తో పాటు సిబ్బందిని సంఘటన స్థలం వద్దకు పంపించాడు. రైతు పరిస్థితి చూసి చలించిన ఎస్ఐ సతీష్ సిబ్బంది సహాయంతో ఓ ట్రాలీ తెప్పించి సిబ్బందితో కలిసి స్వయంగా ధాన్యం బస్తాలను అందులో వేశారు. అటు వైపుగా వెళ్తున్న ప్రజలు పోలీస్‌ల తీరు చూసి సెల్యూట్ పోలీస్ అన్నలు అంటూ వెళ్లడం విశేషం.



- మహిళా సంఘాలలోని నిరక్షరాస్యులకు చదువు
- పేదరిక నిర్మూళన సంస్థ ద్వారా వలంటీర్ల ఏర్పాటు
- ఇప్పటికే గ్రామాలకు చేరిన పుస్తకాలు
- ప్రతీ సభ్యురాలిని అక్షరాస్యురాలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

సైదాపూర్, నవంబర్ 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా నిరక్ష రాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దేందుకు వయోజన విద్యా శాఖ నవ భారత సాక్షరతా కార్యక్రమం ప్రారంభించింది. మొదట పేదరిక నిర్మూలన సంస్థ ఆద్వర్యంలో ఉల్లాస్ (చదువుకుందాం రండి...చదువు నేర్పుదాం పదండి) అనే కార్యక్రమం ప్రారంభించింది. ఇందులో భాగంగా వీవోఏల ద్వారా మహిళా సంఘాలలోని నిరక్ష రాస్యులను గుర్తించారు. వారికి స్వచ్ఛందంగా చదువు నేర్పేందుకు వలంటీర్లను ఏర్పాటు చేశారు. సైదాపూర్ మండలంలో 39 గ్రామ పంచాయతీలుండగా మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో 864 మహిళా సంఘాలున్నాయి. అందులో 3,100 మంది నిరక్షరాస్యులైన సభ్యులను గుర్తించారు. వారికి చదువు నేర్పేందుకు 274 మంది వంటీర్లను ఏర్పాటు చేశారు. ఇప్పటికే నిరక్షరాస్యులకు చదువు నేర్పేందుకు సంబంధించిన పుస్తకాలు గ్రామాలకు చేరాయి. ఆయా వలంటీర్లకు పుకాలు అప్పజెప్పారు.



నిరక్షరాస్యులకు చదువు నేర్పేందుకు ప్రభుత్వం ద్వారా గ్రామాలకు వచ్చిన పుస్తకాలు

ప్రస్తుతానికి 1,200 పుస్తకాలు వచ్చాయని అవి పంచి చదువు చెప్పడం ప్రారంభిస్తామని ఏపీఎం తిరుపతి తెలిపారు. ఈ ఉల్లాస్ కార్యక్రమం ద్వారా పాఠశాల విద్యా పొందని 15 సంవత్సరాల పైన ఉన్న నిరక్ష్యరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దుతారు. చదవడం, రాయడం, అంకెలు గుర్తించడం, కనీస సామర్థ్యాలతో కూడిన లెక్కలు రాయడం నేర్పిస్తారు. ప్రతీ సభ్యురాలిని అక్షరాస్యులుగా తీర్చి దిద్దాలనే లక్ష్యంతో పేదరిక నిర్మూళన సిబ్బంది ప్రయత్నాలు చేస్తున్నారు. అభ్యాసకులు, స్వచ్ఛంద బోధకుల వివరాలు ఉల్లాస్ యాప్‌లో నమోదు చేస్తారు. ప్రతీ సభ్యురాలు కనీసం తన పేరు తాను రాసుకునే విధంగా, తన లెక్కలు తాను చేసుకునే విదంగా తీర్చిదిద్దుతామని ఏపీఎం తిరుపతి తెలిపారు.

నేటి నుంచి పత్తి కొనుగోళ్లు బంద్
- జిన్నింగ్ మిల్లర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు మల్లారెడ్డి

జమ్మికుంట, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ), రాష్ట్ర ప్రభుత్వం నిబంధనలు సడలించాలని విన్నవించుకున్నప్పటికీ ఎలాంటి స్పందన లేక పోవడంతో గురువారం నుంచి పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు కరీంనగర్ జిల్లా జిన్నింగ్ మిల్లర్ల సంఘం జిల్లా అధ్యక్షులు దోనకొండ మల్లారెడ్డి అన్నారు. బుధవారం జమ్మికుంటలో ఆయన మాట్లాడుతూ ఎల్-1, ఎల్-2, ఎల్-3 విధానంలో వెసులుబాటు కల్పించి అన్ని మిల్లులకు నడిచే విధంగా అలాట్మెంట్ ఇస్తామని సీసీఐ హామీ ఇచ్చిందని, కానీ అమలు చేయడం లేదన్నారు. ఫలితంగా జాబ్‌వర్క్ అలాట్మెంట్ కొన్ని మిల్లులకే జరిగి మిగితా మిల్లులకు జరుగక పోవడం వల్ల ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన లేబర్‌కు పనిలేక తిరిగి వెళ్తున్నారన్నారు. ఎకరాకు 12 క్వింటాళ్ల ఉన్న పత్తి దిగుబడిని ఏడు క్వింటాళ్ల వరకు పరిమితం చేయడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సీసీఐ, ప్రైవేట్ పత్తి కొనుగోళ్లను నిలిపి వేస్తున్నందున రైతులు గమనించి సహకరించాలని, పత్తి తీసుకువచ్చి ఇబ్బందులకు గురి కావద్దని సూచించారు.

ఆలయాల్లో ఘనంగా కార్తీక పూజలు


వేములవాడలో సాముహిక లక్ష దీపారాధన చేస్తున్న భక్తులు


ధర్మపురి వద్ద గోదావరిలో భక్తుల స్నానాలు


వెల్గటూరు కోటిలింగాల వద్ద గోదావరి నదిలో భక్తులు


వేములవాడలో దీపారాధన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ గరిమా అగర్వాల్


వేములవాడలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న ఎస్పీ మహేష్ బి. గీతే, ఏఎస్పీ శేషాద్రిని రెడ్డి

వేములవాడ టౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవాలయంలో బుధవారం రాత్రి అర్చకులు జ్వాలా తోరణం నిర్వహించారు. ముందుగా స్వామి వారికి ప్రదోషకాల పూజ చేశారు. రాత్రి 10.15గంటలకు స్వామివారికి అర్చకులు మహాపూజ చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్తీకమాసోత్సవంలో భాగంగా రాజరాజేశ్వర ఆలయంలో ఉదయం స్వామివారికి 11మంది రుత్వికులతో మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అనుబంధ పరివార దేవతలకు అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేలాదిమంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. రాజరాజేశ్వరస్వామి ఆలయంలో స్థానిక భక్తులకు కార్తీకపౌర్ణమి సందర్భంగా గర్భాలయ దర్శనం కల్పించినప్పటికీ ఉదయం 9గంటలకే నిలిపివేసి లఘు దర్శనం ఏర్పాటుచేశారు. కార్తీక దీపాలు వెలిగించి భక్తిప్రపత్తిని చాటారు. భీమేశ్వరాలయంలో స్వామివారికి కోడెల మొక్కులు చెల్లించి ఆర్జిత సేవలైన నిత్యకల్యాణం, సత్యనారాయణ వ్రతాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవో రమాదేవి, బిజేపీ నాయకులు ప్రతాప రామకృష్ణ, వేదపండితులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

వేములవాడలో లక్షదీపోత్సవం

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని భీమేశ్వరాలయం, భీమేశ్వరసదన్‌లో బుధవారం రాత్రి కార్తీక లక్ష దీపోత్సవం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం ఇన్‌చార్జి కలెక్టర్ గరిమా అగర్వాల్, ఈవో రమాదేవి, ఎస్పీ మహేష్ బి. గీతే, ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి కార్తీక దీపాలు వెలిగించారు. అనంతరం ఇన్‌చార్జి కలెక్టర్, ఎస్పీలు భీమేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. సాముహిక దీపాలంకరణకు హాజరైన సుహాసీనులకు వాయినం పసుపు, కుంకుమ, అక్షింతలు, గాజులు, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇఇ రాజేష్, టౌన్ సీఐ వీరప్రసాద్, ఏఈవో శ్రీనివాస్, ఏఈ రామకృష్ణ, పర్యవేక్షకులు శ్రీనివాస్‌శర్మ, సీనియర్ అసిస్టెంట్ ఎడ్ల శివ, చింతపంటి కమలాకర్‌లు పాల్గొన్నారు.

ధర్మపురిలో కార్తీక శోభ

ధర్మపురి : ధర్మపురి క్షేత్రంలో కార్తీక పౌర్ణమి ఉత్సవాలు బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. గోదావరి నదిలో కార్తీక స్నానాలు ఆచరించి శ్రీ లక్ష్మీ నృసింహస్వామి, అనుబంధ దేవాలయాలను దర్శించుకున్నారు. అంతకు ముందు గోదావరి నది పౌరోహితులచే సంకల్పాది పూజలు చేయించుకున్నారు. కార్తీక దీపాలు వెలిగించి గోదావరి నదిలో వదిలి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. యమధర్మరాజు ఆలయం వద్ద భక్తులు గండ దీపంలో నూనె పోసి భక్తి శ్రద్దలతో పూజించారు. దేవాలయం ఆవరణలో గల ఉసిరిక చెట్టు వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తమ కుటుంబ సౌభాగ్యం కోసం లక్ష వత్తులు వెలిగించి, కార్తీక దామోదరుడికి పూజలు చేశారు. బ్రాహ్మణులకు దీప దానం చేసి కట్న కానుకలు సమర్పించారు. ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ధర్మకర్తలు, సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. భరణి నక్షత్రం సందర్భంగా యమధర్మరాజు ఆలయం వద్ద వేదపండితులు, అర్చకులు స్వామి వారికి రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలు, ఆయుష్య హోమం జరిపారు. అనేక మంది భక్తులు గండ దీపంలో నూనె పోసి భక్తి ప్రపత్తులు చాటుకున్నారు. ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి నేతృత్వంలో ధర్మపురి, బుగ్గారం, గొల్లపల్లి, బీర్‌పూర్, సారంగాపూర్ ఎస్ఐలు ఉదయ్ కుమార్, సతీష్, రాజు, కృష్ణసాగర్‌రెడ్డి, గీత బందోబస్తు చేపట్టారు. ధర్మపురి వద్ద గోదావరి హారతి 15వ రోజు బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు.



ధర్మపురి వద్ద గోదావరి హారతి

కోటిలింగాలకు పోటెత్తిన భక్తులు

వెల్గటూర్ : కార్తీక పూర్ణిమ సందర్భంగా బుధవారం కోటిలింగాలకు భక్తులు పోటెత్తారు. గోదావరి నదిలో పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు కార్తీక దీపాలు వెలిగించి గోదావరి నదిలో వదిలారు. కొందరు మహిళలు దీప దానాలు చేశారు. స్నాన ఘట్టాలపై ఇసుక శివ లింగాలు చేసి పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ పార్వతీ కోటేశ్వర స్వామిని దర్శించుకోవడానికి బారులు తీరారు. ఆలయ ప్రాంగణం లోని కాశీ శివలింగం వద్ద అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు నాగరాజు శర్మ, సంజీవ్ శర్మ, అన్వేష్ శర్మలులు భక్తులచే పూజలు జరిపించి ఆశీర్వచనాలు అందజేశారు.ఆలయ ఈవో కాంతారెడ్డి, చైర్మన్ పూదరి రమేష్, ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేశారు. సీఐ రాం నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో ఎస్సై ఉమాసాగర్ బందోబస్తు నిర్వహించారు.


ధర్మపురి ఆలయంలో బారులుతీరిన భక్తులు

కొండగట్టులో గిరిప్రదక్షిణ


కొండగట్టులో గిరిప్రదక్షిణ చేస్తున్న భక్తులు

మల్యాల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): : ప్రతి పౌర్ణమి రోజు కొండగట్టు ఆంజనేయస్వామి గిరుల చుట్టూ నిర్వహిస్తున్న గిరిప్రదక్షిణ బుధవారం నిర్వహించారు. హైదరాబాద్ చిలుకూరు బాలాజీ ఆలయంలోని శివాలయం ప్రధాన అర్చకులు సురేశ్ ఆత్మారాం మహారాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ గిరి ప్రదక్షిణకు వేలాది మంది భక్తులు హాజరై దిగువ కొండగట్టులో పూజలు నిర్వహించారు. గిరి ప్రదక్షిణ ముగిసిన అనంతరం కొండపైన స్వామి వారిని దర్శించుకున్నారు.

నిర్లక్ష్యం.. నిరుపయోగం

- అపరిశుభ్రతతో కొండగట్టు ఆలయ పాత కోనేరు


బండరాళ్లతో పాత కోనేరు
పాత కోనేరులో పేరుకున్న నాచు, చెత్త

మల్యాల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయ పాత కోనేరు నిరుపయోగంగా మారింది. కొన్నేళ్ల క్రితం ఆలయం ఈశాన్య భాగంలో నూతన కోనేరును ప్రారంభించిన అనంతరం పాత కోనేరును వినియోగించకపోవడంతో మూలన పడింది. అయితే దాన్ని చదును చేసి వినియోగంలోకి తీసుకువచ్చే అవకాశం ఉన్నప్పటికీ పట్టించుకునే వారే కరువయ్యారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పాత కోనేరును మూసి అభివృద్ధి చేయాల్సి ఉండగా అలాంటి చర్యలు తీసుకోకపోవడంతో బండరాళ్లతో నిండిపోగా మరికొంత ప్రాంతం చెత్త, నాచుతో దర్శనం ఇస్తోంది. సమీపంలోనే ప్రసాద తయారీ కేంద్రం ఉండడంతో భక్తులు ఆసహనం వ్యక్తం చేస్తున్నారు.

లీజుకు కొండగట్టు అంజన్న భూములు

- దేవస్థానం ఈవో శ్రీకాంత్‌రావు
- దేవస్థానం భూముల పరిరక్షణకు చర్యలు



మల్యాల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం పేరిట గల కొన్ని భూములను లీజుకు ఇవ్వనున్నట్లు ఈవో శ్రీకాంత్‌రావు తెలిపారు. దేవస్థానం కార్యాలయ సమావేశం మందిరంలో ఈవో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా అభివృద్ధి పనులు, ఆర్జిత సేవల టికెట్ల పెంపు తదితర వాటి గురించి వివరించారు. అంజన్న పేరిట సుమారు 350 ఎకరాలకు పైగా భూములు ఉండగా అందులోని కొడిమ్యాల మండలం రాంసాగర్‌లో గల 8 ఎకరాలు, దిగువ కొండగట్టు సమీపంలోని ముత్యంపేట పరిధిలోగల 3 ఎకరాల భూమిని లీజుకు ఇవ్వనున్నట్లు తద్వారా దేవస్థానం ఆదాయం సమకూరుతుందని అన్నారు. ఈ మేరకు నిబంధనలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. అలాగే దిగువ కొండగట్టులో ఆక్రమణకు గురి అయిన దేవస్థానం భూముల స్వాధీనానికి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు.

- **ఆర్జిత సేవల టికెట్ల రేట్లు పెంపు**

కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానంలోని ఆర్జిత సేవల టికెట్ల రెట్లను రెట్టింపు పెంపు చేస్తూ మరిన్ని కొత్తగా ఆర్జితసేవలను ప్రారంభించనున్నట్లు ఈవో శ్రీకాంత్‌రావు తెలిపారు. పెంచిన టికెట్ల ధరలను ఈ నెల 15 నుంచి అమలు చేయనున్నట్లు ఈవో తెలిపారు. టికెట్ల పెంపు భారం కానుందని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీస వసతులు కల్పించకుండా టికెట్ల పెంపు చేపట్టడం పట్ల విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. శాశ్వత అభిషేకం సేవను పది రెట్లు పెంచడం సరికాదని భక్తులు పేర్కొంటున్నారు.

- **ప్రజా సంబంధాల విభాగం ఏర్పాటు**

కొండగట్టులో భక్తులు, ప్రముఖుల సౌకర్యార్థం ప్రజాసంబందాల విభాగం ఏర్పాటు చేసినట్లు ఈవో తెలిపారు. సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యాలయం కొండపైన గల బస్టాండ్ వద్ద నిత్యం అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు. సమ్మక్క, సారక్క జాతర నేపథ్యంలో భక్తుల రద్దీ పెరిగే అవకాశం ఉన్నందున ఇబ్బందులు కలుగకుండా క్యూలైన్ తదితర ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఆలయం ముందు గల రావి చెట్టు వద్ద దీపాలంకరణకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరుగుతుందని అన్నారు. ఈ సమావేశంలో ఈవోతో పాటు ఆలయ స్థానాచార్యులు కపీందర్, ప్రధాన అర్చకులు జితేంద్రప్రసాద్, ఉప ప్రధాన అర్చకులు చిరంజీవి, పర్యవేక్షకులు సునీల్, హరిహరనాథ్ తదితరులు ఉన్నారు.

● పెరిగిన ఆర్జిత సేవల రుసుములు

క్రసం	ఆర్జిత సేవ	ప్రస్తుత రుసుము	పెంపుదల రుసుము	టికెట్‌పై ఇచ్చు వస్తువులు
1.	చందనం పూజ	రూ.800	రూ.1500	కండువా, రెండు కనుములు, 400గ్రా. అభిషేక లడ్డు
2.	అంతరాలయ దర్శనం	రూ.400	రూ.800	కండువా, రెండు కనుములు, 100గ్రా. అభిషేక లడ్డు
3.	గండదీపం	రూ.5	రూ.10	నూనె ఇవ్వబడును
4.	శాశ్వత అభిషేకం	రూ.1116	రూ.10116	పది సంవత్సరాల వరకు
5.	11 రోజుల హారతి	రూ.250	రూ.516	

నూతనంగా ప్రవేశ పెడుతున్న పూజల వివరాలు

- సుప్రభాతసేవ - రూ.1000 - ఒక కండువా, రెండు కనుములు, 400గ్రా. అభిషేక లడ్డు
- వడమాల భోగము - రూ.116 - 5 వడలు, లడ్డు
- మన్యసూక్త హోమం- రూ.2000 - పూజాసామగ్రి, లడ్డు
- శనిగ్రహ పీడ నివారణ - రూ.1000 కండువా, రెండు కనుములు, 400గ్రా. అభిషేక పూజ లడ్డు

వైభవంగా కార్తీక పౌర్ణమి వేడుకలు

- గోదావరిలో భక్తుల పుణ్యస్నానాలు
- కిక్కిరిసిన శైవ క్షేత్రాలు సత్యనారాయణ వ్రతాలు


జగిత్యాల మార్కండేయ ఆలయంలో ధ్వజ స్తంభం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు

జగిత్యాల అర్బన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఆలాయాలు వేలాదిగా తరలివచ్చిన భక్తుల తో కిటకిట లాడాయి. పట్టణంలోని పట్టణం లోని మార్కండేయ స్వామి, శ్రీ గుట్ట రాజేశ్వర స్వామి, బ్రాహ్మణ వీధిలోని హరిహర, విశ్వేశ్వర , శ్రీ శ్రీనివాసాంజనేయ, భవానీ శంకర ఆలయాలలో కార్తీక చదుర్ధి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ స్వామి వారలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు ఆలయాల్లో పూజలు నిర్వహించారు. అనం తరం బ్రాహ్మనోత్తములకు దీప దానాలు, కుష్మాండ దానాలు సమర్పించారు. భక్తులు సత్సంగ్ లో భజన కీర్తనలతో అలరించారు.

●**జగిత్యాలరూరల్:** జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస సహస్ర లింగాల ఆలయం, పొలస్తేశ్వర, అంబారిపేట శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయాలతో పాటుగా పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. తెల్లవారుజామున నుంచే వందల సంఖ్యలో భక్తులు పవిత్ర గోదావరి నదుల్లో పుణ్యస్నానాలు చేసి, స్వామివార్ల దర్శనం కోసం ఆలయానికి తరలి వచ్చారు. భక్తులు కార్తీక దీపాలను వెలిగించగా, భజనలు హారతులతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అంబారిపేట వెంకటేశ్వర ఆలయంలో భక్తులు గిరి ప్రదర్శన నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

●**కోరుట్ల:** పట్టణంలోని మహాదేవ స్వామి, నగేశ్వర దేవలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ సందర్భంగా దేవాల యాలలో వేద పండితులు, పురోహితుల మంత్రోచ్చరణ మధ్య ప్రత్యేక పూజల ను నిర్వహించారు. దేవాలయాలలో మహిళలు కార్తిక దీపాలను వెలిగించారు.

●**కోరుట్ల రూరల్:** మండలంలోని వెంకటాపూర్ వేంకటేశ్వర స్వామి దేవాలయ బ్రహోత్సవాలలో భాగంగా కార్మిక పౌర్ణమి పురస్కరించుకొని సామూహిక సత్యనారాయణ వ్రతాలను వైభవంగా జరిపారు. దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన పురోహితులు దేవాలయ సముదాయ మందిరంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలను జరిపారు. సామూహిక సత్యనారాయణ వ్రతాలలో అధిక సంఖ్యలో దంపతులు పాల్గొన్ని మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి సమయంలో తులసి కళ్యాణంను పురోహితులు నిర్వహించారు. అదే విధంగా మండలంలోని అన్ని గ్రామాలలో కార్మిక పౌర్ణమి వేడుకలు గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు.

●**మెట్‌పల్లి రూరల్:** కార్తీక మాసంలోని పౌర్ణమి పురస్కరించుకుని మండలంలోని పెద్దాపూర్ గ్రామ శివారులోని ఇస్కాన్ హరే కృష్ణ ఆలయంలో వేడుకలు వైభవంగా నిర్వహించారు. బుధవారం ఆలయంలోని గిరిగోవర్ధన్ పర్వతం రూపంలో అలంకరించి స్వామి వారికి 108 రకాల ప్రసాదాలను నైవేద్యంగా సమర్పించారు. ముందుగా ఆలయంలోని స్వామి వారికి అభిషేకాలు, గోపూజా, గిరి గోవర్ధన శీల అభిషేకం, హరతీ, ప్రత్యేక దివ్య దర్శనం వంటి కార్యాక్రమాలను నిర్వహించారు. అనంతరం స్వామి వారిని భక్తులు దర్శించుకుని కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని స్వామి వారి ముందు దీపాలను భక్తులు వెలిగించారు. స్వామి వెలిగించిన తరువాత దీపారాధన చేయడానికి పలు ప్రాంతాల నుండి భక్తులు అదిక సంఖ్యలో హాజరయ్యారు. అనంతరం నిర్వహకులు అంద జేసిన తీర్థా ప్రసాదాలను భక్తులు స్వీకరించారు. వెల్లుల్ల గ్రామంలోని ప్రభుత్వం పాఠశాలలో యాభైఐదు వేల దీపారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా అత్యంత శుభప్రదంగా భావించిన భక్తులు దేవత మూర్తులు, స్వస్తిక్, ఓంకార గర్తుల అకారంగా వెలింగించారు.

●**సారంగాపూర్:** జిల్లాలోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ దుబ్బరాజన్న ఆలయంలో బుధవారం కార్తీక సందడి నెలకొంది. వేకువ జాము నుండు భక్తులో కోనేరులో స్నానాలు ఆచరించి భక్తిశ్రద్దతో ఆలయానికి చేరుకున్నారు. భక్తులు ఆలయంలో దీపాలు వెలింగాంచారు. క్యూలైన్‌లో నిలబడి తమ మొక్కులు చెల్లిచుకున్నారు భక్తులతో ఆలయం కిటకిటలాడింది. .సాయంత్రం ఆలయ ఆవరణలో దీపాలు వెలిగించారు. దీంతో ఆలయం దీపాల కాంతులతో కార్తీక శక్షభనకు సంతరించుకుంది. ఆలయ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈవో అనూష, చైర్మన్ శంకరయ్య. సిబ్బంది లక్ష్మీరాజం, రజినికాంత్, భక్తులు పాల్గొన్నారు

●**బీర్‌పూర్:** బీర్‌పూర్ మండలంలో బుధవారం కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. కార్తీక పౌర్ణమి సందర్భంగా మండలంలోని బీర్‌పూర్ శ్రీ లక్ష్మీనరసింహా స్వామి ఆలయంలో, తుంగూర్‌లోని రాజరాజేశ్వరా స్వామి, వేణుగోపాల స్వామి ఆలయాల్లో, కొల్వాయిలోని రామలయంలో భక్తులు దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బారీ సంఖ్యలో మహిళలు, చిన్నారులు. అర్చకులు, తాజా మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

●**పెగడపల్లి:** పెగడపల్లి మండలంలో బుధవారం కార్తీక పౌర్ణమి వేడుకలు భక్తి శ్రద్దలతో అత్యంత వైభవంగా జరుపుకున్నారు. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని వేకువజామునుండే మండల కేంద్రంలోని స్వయంభూ శ్రీరాజరాజేశ్వర ఆలయం, వెంగళాయిపేట రాజన్న ఆలయం, నంచర్ల, ఎల్లాపూర్, అయిత్‌పల్లి, నామాపూర్ గ్రామాల్లోని సీతారామచంద్రస్వామి ఆలయాలలో భక్తులు దర్శించుకుని ఉసిరి చెట్ల కింద దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా పెగడపల్లి రాజన్న ఆలయంలో రాత్రి ఆరు వేల దీపాలు వెలిగించి కార్తీక పౌర్ణమిని వైబవంగా జరుపుకున్నారు.

●**కొడిమ్యాల:** మండల కేంద్రంలోని సాయి బాబా, శ్రీ ఆంజనేయస్వామి, గుండ్రప్ప శివాలయం, హ్మితురావుపేట, చెప్యాల కట్ట శివాలయాల్లో, మండలంలోని పూడూర్ సాయిబాబా ఆలయాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. కొడిమ్యాల, పూడూర్ సాయిబాబా ఆలయాల్లో భక్తులు ప్రజలకు అన్నదానం చేసారు. ఆలయాల్లో ఉదయం నుంచి పంచామృత అభిషేకం, పల్లకీ సేవ, మధ్యాహ్నా హారతి భక్తులు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో అన్నదాతలు, శ్రీసాయి సేవా సమితి సభ్యులు, రమేష్, ఆదిరెడ్డి, శ్రీనివాస్, పూజారి శ్రీనివాస్, భక్తులు, ఆయా గ్రామాల ప్రముఖులు పాల్గొన్నారు.

●**మల్యాల:** మండలంలోని శివాలయాలో కార్తీక పౌర్ణమి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. అంజన్న సన్నిధిలో భక్తులు రావి చెట్టు, తులసీ కోట వద్ద దీపాలు వెలిగించారు.

●**గొల్లపల్లి:** గొల్లపల్లి మండలంలోని బీమ్‌రాజ్ పల్లి గ్రామంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. కలశ స్థాపన, గణపతిపూజ, శ్రీ రమా సమేతా సత్యనారాయణ స్వామి వ్రతం, నవ విధాబిషేకం నవగ్రహ పూజలు, అష్టదిక్పాలక పూజలు, బరహ్మశ్రీ తిప్పర్తి సత్యాచార్యుల వేదమంత్రోచ్చరణల మధ్య కన్నుల పండువగా నిర్వహించారు. గ్రామంలోని 8 జంటలు పాల్గొన్నా ఈ సత్యనారాయణ వ్రత పూజలో అనంతరం జంటలకు శ్రీ స్వామి వారి ప్రసాదాన్ని అంద జేశారు. అనంతరం దేవీ నవరాత్రుల సందర్భంగా భక్తులు తెచ్చిన ఒడి బియ్యాతో మహాన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ బొమ్మెన కుమార్ గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొనారు.

●**రాయికల్:** రాయికల్ పట్టణంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో కార్తీక పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పలు ఆలయాల్లో ఉదయం నుంచే భక్తులు బారులు తీరి తమ మొక్కులు చెల్లించుకున్నారు. మండలంలోని ఇటిక్యాల సాయిబాబా ఆలయంలో పండితుడు శివశంకర్ శర్మ ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు సత్యనారాయణ స్వామి వ్రతాలు జరుపుకున్నారు. మహిళలు కార్తీక దీపాలను ఉసిరి చెట్టు దగ్గర పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. సాయప్ప ట్రస్ట్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో భరత్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, మాజీ సర్పంచులు మరిపెల్లి నారాయణ గౌడ్, నీరటి శ్రీనివాస్, గ్రామ సేవాసమితి అధ్యక్షుడు అనుపురం చిన్న లింబాద్రి గౌడ్, నేరెళ్ల లక్ష్మయ్య, చంద్రకంటి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

●రాయికల్ పట్టణంలోని మార్కండేయ దేవాలయంతో పాటు శివాలయంలో బుధవారం కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని దీపాలంకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులు ఓం, స్వస్తిక్, శివలింగం, అమ్మవారి అలంకరణ ఆకారంలో దీపాలంకరణ చేశారు.

●**మల్లాపూర్:** కార్తీక పౌర్ణమి సందర్భంగా మల్లాపూర్‌తో పాటు ఆయా గ్రామాల్లో బుధవారం భక్తులు తులసి కల్యాణంను ఘనంగా జరిపారు. తమ ఇండ్లలో గల తులసి కోటను అందంగా అలంకరించి పూలు, ఆకులతో పందిరి వేసినారు, ఆకులతో పందిరి వేసినారు. చుట్టూ రంగు రంగుల ముగ్గులను వేసినారు. సంప్రదాయంగా రాధా కృష్ణులను కల్యాణం నిర్వహించారు. ఉదయమే గంగానదికి వెళ్లి పవిత్ర స్నాహ్నలు చేసినారు. కార్తీక దీపాలను వెలిగించి నదిలో వదలినారు. ఇండ్లలో వివిధ రకాల వత్తులను వెలిగించి కార్తీక పౌర్ణమి వేడుకలను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు.

●కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం మల్లాపూర్ శ్రీకనుక సోమేశ్వ రాలయ కొండల కింద, వాల్గొండ త్రికుటాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. లక్షదీపారాధన కార్యక్రమంను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆకాశదీపాన్ని వెలిగించి ప్రత్యేక పూజలు జరిపారు. దీపాలను వివిధ ఆకృతుల్లో అమర్చి వెలిగించారు. అతి పురాతన ఈ రెండు ఆలయాల్లో జరిగిన లక్ష డిపార్చన్ వేడుకల్లో స్థానికులతో పాటూ పరిసర గ్రామాల భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


దుబ్బరాజన్న ఆలయంలో భక్తుల పూజలు


రాయికల్‌లో శివలింగం ఆకారంలో వెలిగించిన దీపాలు


అంబారిపేట వేంకటేశ్వర ఆలయంలో గిరి ప్రదక్షిణ నిర్వహిస్తున్న భక్తులు


నంచర్ల రామాలయంలో భక్తుల పూజలు


వాల్గొండ రామలింగేశ్వరాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు


కోరుట్ల మహాస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు


చౌలమద్దిలోని ఇస్కాన్ ఆలయంలో స్వామికి 108 రకాల నైవేద్యం


కొడిమ్యాలలో ఆలయ ఆవరణలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

విద్యుత్ తీగలపై మాంసం వ్యర్థాలు..

-తరచూ ట్రిప్ అవుతూ విద్యుత్ సరఫరాకు అంతరాయం


ట్రాన్స్‌ఫార్మర్‌పై పడవేసిన మాంసం వ్యర్థాలు

జగిత్యాల టౌన్, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్‌పై మాంసం వ్యర్థాలు పడవేయడంతో ట్రాన్స్‌పార్మర్ ట్రిప్ అవుతు తరచూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జగిత్యాల పట్టణంలోని మాంసం వ్యాపారులు ప్రతి రోజు మాంసం వ్యర్థాలను హజారి శ్మశాన వాటిక సమీపంలో పడవేసి వెళ్త న్నారు. వాటిని విసిరి వేయ దంతో అవి విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్‌పై పడి దుర్గందం రావడంతో పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. ఇప్పటికైనా బల్దియా అధికారులు స్పందించి మాంసం వ్యర్థాలు అక్కడ పడేయకుండా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

పెగడపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని పెగడపల్లి మార్కెట్ చైర్మన్ బుర్ర రాములు గౌడ్ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ప్యాక్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూకాన్ని మండల కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలసి రాములు గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక శాసనసభ్యుడు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ నిత్యం అధికారులతో సమీక్షిస్తూ రైతులకు ఇబ్బందులు కలుగకుండా ధాన్యం తూకం వేయిస్తుండగా బీఆర్ఎస్ నాయకులు మంత్రి పట్టించుకోలేదనడం విడ్డూరంగా ఉందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే క్వింటాలుకు నాలుగు నుండి ఎనిమిది కిలోల వరకు తప్పతాలు పేరుతో కటింగ్ చేసిన విషయం మర్చిపోయి మాట్లాడటం విడ్డూరంగా ఉందని అన్నారు. కార్యక్రమంలో మార్కుట్ కమిటీ వైస్ చైర్మన్ సత్తిరెడ్డి, నాయకులు ఒరుగల శ్రీనివాస్, ఎలగొండ కృష్ణహరి, చెట్ల కిషన్, తడగొండ రాజు, బాస్కర్, రమేష్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి

పెగడపల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికలలో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలనే డిమాండ్‌తో బీసీ సంఘాల ఆధ్వర్యంలో పెగడపల్లి మండల కేంద్రంలో ఈ నెల 1 నుండి చేస్తున్న రిలే నిరాహార దీక్ష బుధవారం ఐదవ రోజుతో ముగించారు. బుధవారం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి దీక్షను విరమించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నీరటి రాజ్ కుమార్, గర్వంద శేఖర్ గౌడ్, ఉప్పు రవి, బండారి బీరయ్య, ముల్క రాజేశం, చిందం తిరుపతి, పుల్కం జలపతి, ఒరుగల శ్రీనివాస్, బుర్ర రాములు గౌడ్, తిరుపతి, ఆకుల విష్ణు, ఎలగొండ కృష్ణహరి పాల్గొన్నారు.

రహదారి మరమ్మతుకు మోక్షమెప్పుడో..?

●అడుగడుగునా గుంతలు ● పట్టించుకోని బల్దియా అధికారులు ● ఇబ్బందులు పడుతున్న పట్టణ ప్రజలు


గుంతలమయమైన రోడ్డులో వర్షానికి నిలిచిన నీరు

జగిత్యాల టౌన్, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పట్టణంలోని పార్క్ సందిలో గల రహదారి మరమ్మతుకు నోచుకోక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు బల్దియాకు ఆదాయం సమకూర్చడంలో చూపెట్టిన శ్రద్ధ వసతుల కల్పనలో చూపించడం లేదని పట్టణ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జగిత్యాల పట్టణంలోని పార్క్ సందిలో మున్సిపల్ అధికారులు షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేశారు. ఇందులో భాగంగా 36 షాపులు నిర్మించగా సుమారుగా ఒక్కో షాపుకు రూ.4 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు డిపాజిట్ (గుడ్‌విల్) చెల్లించి షాపులను అద్దెకు తీసుకున్నారు. ప్రతి నెల అద్దె రూ.3300 చొప్పున ఏడాదికి రూ.14,25,600 అద్దెను బల్దియా అధికారులు వసూలు చేస్తున్నారు. అయితే పార్కు సంధి నుంచి షాపుల ముందు ఉన్న రోడ్డు కొత్త బస్టాండ్, టవర్ సర్కిల్ దగ్గర దారిగా వాహనదారులు, పాదాచారులు ఈ మార్గంలోనే వెళ్తుంటారు. దీంతో ఈ రోడ్డు రద్దీగా ఉంటుంది. ఈ రోడ్డును చాల రోజుల కింద వేయగా ప్రసుత్తం పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వర్షం పడితే గుంతల్లో వాహదారులు పడి గాయాల పాలవుతున్నారని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పలుమార్లు మున్సిపల్ అధికారులకు పిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు

-గంగాధర్, షాపు యజమాని



రోడ్డు దెబ్బతిని గుంతలు ఏర్పడ్డాయి. వర్షాలు పడినప్పుడు మా బాధలు వర్ణనాతీతం. చాలా సార్లు మున్సిపల్ అధికారులకు పిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు. మున్సిపల్ అధికారులు మా వద్ద దుకాణం అద్దెలు తీసుకుంటున్నప్పుడు కనీస సౌకర్యాలు కల్పించాలి.

మరమ్మతు చేయించాలి

-భాస్కర్, బట్టల షాపు యజమాని

షాపుల ముందు రోడ్డుపై గుంతలు పడడంతో నిత్యం వాహనాల రద్దీతో దుమ్మంతా మా షాపుల్లో చేరి ఇబ్బందులు పడుతున్నాం. దీన్ని కస్టమర్లు రాక గిరాకి దెబ్బతింటోంది. ప్రతి నెల అద్దె తీసుకుంటున్న మున్సిపల్ అధికారులు స్పందించి కనీస వసతులు కల్పించాలి.

రైస్ మిల్లుల్లో తనిఖీలు నిర్వహించాలి


మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

కోరుట్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రైస్ మిల్లులలో పారదర్శకమైన తనీఖీలను నిర్వహించి రైతులను న్యాయం చేయ్యాలని రైతు సంఘ నాయకులు ఆకుల రంజిత్, కలాల సాయిచంద్, పుల్లగుర్ల కొండల్ రెడ్డి, భీమనాతి శ్రీధర్‌లు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలోని అష్టలక్ష్మి దేవాలయ అవరణలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో రైతు సంఘ నాయకులు మాట్లాడారు. పౌరసరఫరాల శాఖ రాష్ట్ర వ్యాప్తంగా రూ.40 వేల కోట్ల అప్పుల ఉన్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పలు మార్లు ప్రకటించారని అన్నారు. రైస్ మిల్లులో దాన్యం నిల్వలలో అవకతవకల గురించి సమగ్ర విచారణ వడ్ల నిల్లల తనిఖీలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం రైస్ మిల్లర్ల కుమ్మకై ఉండి రాష్ట్రంను అప్పుల పాలు చేసిందని ప్రభుత్వ ఇప్పుడు ఉన్న ప్రభుత్వం కూడ అదే రకంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. రైతులకు బకాయి ఉన్న రూ. 500 బోనస్ వరి దాన్యం డబ్బులు విడుదల చేయాలని అన్నారు. ఈ సమావేశంలో రైతు సంఘ నాయకులు సదుల సుదర్శన్, కటుకం రాజేశం, బోయ నర్సరెడ్డి, బోదాను మహేష్, శేఖర్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

ఆసక్తి ఉన్నా.. ఆడించే వారేరి..?

(ఐదో పేజీ తరువాయి)

జూనియర్ కళాశాలల్లో ఒక్కచోట కూడా ఫిజికల్ డైరెక్టర్లు లేకపోవటం గమనార్హం. దీంతో ఆయా ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు ఆటలకు దూరంగా ఉంటున్నారు. పదో తరగతి వరకు ఆటల్లో మెరికలుగా ఉన్న వారు సైతం ఇంటర్మీడియట్‌లోకి రాగానే చ తికిల పడిపోతున్నారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తూ ఉజ్వల భవితకు బాటలు వేసుకోవాలనుకునే విద్యార్థుల లక్ష్యం నెరవేరని పరిస్థితి నెలకొంది.

●నిరుపయోగంగా క్రీడా సామగ్రి

క్రీడలను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాల్లో ప్రత్యేక క్రీడా కోటాను అమలు చేస్తున్నారు. రాష్ట్ర జాతీయ స్థాయిలో రాణించిన వారిని రిజర్వేషన్‌ను వర్తింపజేస్తున్నారు. చదువుకు ఇది అదనపు అర్హతగా గుర్తిస్తున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే విద్యార్థులు ఇలాంటి అవకాశాల్ని కోల్పోవాల్సి వస్తోంది. ఇటీవల పలు జూనియర్ కళాశాలలకు క్రీడా సామాగ్రిని పంపిణీ చేశారు. ఆడించే వారు లేకపోవటంతో అవి నిరుపయోగంగా మారాయి.

వేంకటేశ్వర స్వామి తెప్పోత్సవం


స్వామివారి తెప్పోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

కోరుట్ల రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంకటాపూర్ వేంకటేశ్వర స్వామి దేవాలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామి వారి తెప్పోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గ్రామ శివారులోని పెద్ద చేరువులో స్వామి వారి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ సలహాదారును కలిసిన జగిత్యాల ఎమ్మెల్యే

జగిత్యాల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): హైద్రాబాద్‌లోని సచివాలయంలో ప్రభుత్వ సలహాదారుగా బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ మాకునూరి సంజయ్ కుమార్ కలిశారు. పదవీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమానికి ఎమ్మెల్యే సంజయ్ కుమార్ హాజరై ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డికి పూలమొక్కను అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.